సాక్షి విశాఖపట్నం

బుధవారం । 19 । జూన్ । 2024



'అల్లూరి' వెదురు అదిరే.. 8లో

ఇప్పటి వరకు పోటీ ఇచ్చిన అసోం వెదురు నాణ్యతగా లేనందున రైతులు మళ్లీ అటవీ శాఖ వెదురును కొనుగోలు చేస్తున్నారు.



శ్రావణం వరకు ఆగాల్సిందే..

పెళ్లి బాజాలు మోగాలంటే శ్రావణం వరకు ఆగాల్సిందే. అప్పుడే మూడుముళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. 8లో



యోగా.. హుషారుగా..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు చిన్నారులు యోగాసనాలు వేశారు. 8లో

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీలో 50 శాతం ఉత్తీర్ణత

రాష్ట్రంలో జిల్లాకు 22వ స్థానం

విశాఖ విద్య: ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. డిగ్రీ, ఇతర ఉన్నత విద్య కోర్సుల్లో చేరే విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తొలుత ద్వితీయ సంవత్సరం ఫలితాలను ప్రకటించారు. జిల్లాలో 7,500 మంది పరీక్షలకు హాజరుకాగా, వీరిలో 3,777 మంది పాసయ్యారు. 50 శాతం ఉత్తీర్ణత నమోదైంది. దీంతో సప్లిమెంటరీ ఫలితాల వరకు రాష్ట్ర సూచికలో జిల్లాకు 22వ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 334 మంది పరీక్ష రాయగా వీరిలో 150 మంది పాసయ్యారు. తద్వారా 45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లయింది. దీంతో రాష్ట్ర సూచికలో జిల్లా 24వ స్థానంలో నిలిచింది. ఎయిడెడ్ కాలేజీల పరంగా జిల్లాలో 37.84 శాతం, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలు 41.67 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ కాలేజీ 66.67 శాతం, బీసీ వెల్ఫేర్ కాలేజీ 42.86 శాతం సాధించారు. అదే విధంగా ప్రభుత్వ కాలేజీల్లో జిల్లా సగటు 46.08 శాతం నమోదైంది. ప్లస్ టూ హైస్కూల్ ఈ సారి కూడా వెనుకబడ్డాయి. జిల్లాలోని 5 ప్లస్ టూ హైస్కూళ్లలో 25 శాతం ఫలితాలు వచ్చాయి. మల్కాపురంలో ఏ ఒక్క విద్యార్థి పాస్ కాలేదు. గోపాలపట్నంలో తక్కువగా 15 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో 64.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని కాలేజీల్లో జిల్లా సగటున 51.66 శాతం ఫలితాలు వచ్చాయి.

21న సింహగిరిపై వడాయితీ సంప్రోక్షణ

సుప్రభాత, ఉదయం ఆరాధన సేవలు రద్దు



అప్పన్న స్వామి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 21న వడాయితీ సంప్రోక్షణ నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మృగశిర కార్తె ప్రవేశించిన తర్వాత ఆగమశాస్త్రం ప్రకారం ఏటా స్వామికి వడాయితీ సంప్రోక్షణ నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా ఈ నెల 21న ఉదయం అలయ శుద్ధి, సంప్రోక్షణ, స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. ఆ రోజు సుప్రభాతం, ఉదయం ఆరాధన సేవలను రద్దు చేశామని, రాజభోగం నివేదన కూడా ఉదయమే నిర్వహిస్తామన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు దర్శనాల బ్రేక్ ఉండదని, ఆ సమయంలో కూడా దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఆస్థానం, విశేష ఆరాధన, నివేదన, సాయంత్రం 5 గంటల నుంచి గ్రామ తిరువీధి ఉంటాయని వివరించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.


ఆరు బస్సులపై కేసులు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఆరు బస్సులపై రవాణా శాఖ అధికారులు మంగళవారం కేసులు నమోదు చేశారు. నగరంలోని గంభీరం, సింహాచలం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు చేసిన తనిఖీల్లో 16 బస్సులపై కేసులు నమోదు చేయగా ఒక బస్సును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో మోటారు వాహన తనిఖీ అధికారులు ఐ.వేణుగోపాలరావు, ఏఎస్ గణేష్ రెడ్డి, మాధవి, రాజారావు, ప్రకాష్‌రావు, కె.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ డిప్లమా దరఖాస్తు గడువు పెంపు



ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ మనుమంతు పురుషోత్తం తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో ఈ కోర్సు తరగతులు ప్రారంభమవుతాయన్నారు. దరఖాస్తులను ఏయూ వెబ్‌సైట్ www.andhrauniversity.edu.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9599229217 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వెంటాడుతున్న బోటు ప్రమాదాలు!



ఫిషింగ్ హార్బర్‌లో కాలిపోతున్న బోట్లు (ఫైల్)

- ఏడు నెలల కిందట హార్బర్‌లో 49 బోట్ల దగ్ధం
- ఏప్రిల్ 4 అర్ధరాత్రి నడి సంద్రంలో మరో పడవ
- రెండు రోజుల కిందట ఇంకో బోటు మునక
- తాజాగా సముద్రంలో మరో బోటు ఆహుతి
- వరస ఘటనలతో భీతిల్లుతున్న మత్స్యకారులు



మునిగిన బోటును బయటకు తీస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: మత్స్యకారులను బోటు ప్రమాదాలు వెంటాడుతున్నాయి. వరసగా జరుగుతున్న ఈ ప్రమాదాలు వారిని కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గత ఏడాది నవంబర్ 14 రాత్రి విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు బయల్దేరిన మరబోటు భీమునిపట్నం సమీపంలో ప్రమాదానికి గురైంది. దీంతో అందులో ఉన్న కలాసీలు ప్రాణభయంతో సముద్రంలోకి దూకేసి ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ప్రమాదంలో బోటు యజమానికి రూ.10 లక్షల నష్టం వాటిల్లింది.

- సరిగ్గా ఏడు నెలల కిందట నవంబరు 19వ తేదీ అర్ధరాత్రి విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాద ఘటనలో 49 బోట్లు ఆహుతయ్యాయి. దీంతో ఆ బోట్ల యజమానులతో పాటు వాటిపై ఆధారపడ్డ 400 మందికి కలాసీలు జీవనోపాధి కోల్పోయారు. వీరు రోడ్డున పడకూడదన్న ఉద్దేశంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలిపోయిన 49 బోట్లకు రూ.7.11 కోట్లు, కలాసీలకు రూ.10 వేల చొప్పున మూడు రోజుల్లోనే పరిహారం అందజేసింది.
- ఈ ఘటన జరిగిన ఐదు నెలలకు ఏప్రిల్ 4 అర్ధరాత్రి విశాఖకు 65 నాటికల్ మైళ్ల దూరంలోని నడి సముద్రంలో బోటులోని వంట గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో 9 మంది మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారు. కోస్ట్‌గార్డు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వారిని రక్షించారు. గాయపడ్డ వారిని కేజీహెచ్‌లో చేర్చి చికిత్స అందించారు.
- ఇక ఈ నెల 16వ తేదీ ఆదివారం రాత్రి ఫిషింగ్ హార్బర్ 11వ నంబరు జెట్టీలో మరపడవ మునిగిపోయింది. దీంతో ఆ బోటు యజమానులు కోడ లక్ష్మమ్మ, ఎర్రన్నలకు రూ.25 లక్షల నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బోటు యజమానులకు అండగా నిలిచారు. తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. నష్టపరిహారం అందేలా ఈ విషయాన్ని మత్స్య శాఖ జేడీ, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని వాసుపల్లి తెలిపారు.



సురక్షితంగా ఒడ్డుకు చేరిన మత్స్యకారులు

- ఈ ప్రమాదం జరిగిన 24 గంటలు గడవక ముందే సోమవారం రాత్రి విశాఖకు 28 నాటికల్ మైళ్ల దూరంలోని పూడిమడక సమీపంలో మెకనైజ్డ్ బోటు దగ్ధమైంది. ప్రమాదానికి గురైన పడవకు చేరువలో వేట సాగిస్తున్న మరో బోటు సిబ్బంది ఇందులో ఉన్న మత్స్యకారులను రక్షించారు. దీంతో ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా బయటపడ్డారు. వీరు మంగళవారం ఉదయానికి విశాఖ ఫిషింగ్ హార్బరుకు చేరుకున్నారు. ఈ బోటు కాలిపోవడంతో యజమానికి రూ.30 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. సంఘటనలో నష్టపోయిన బోటు యజమానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సాయం మత్స్యసంఘాల నాయకులు కోరారు. ఇలా విశాఖ హార్బర్, పరిసర సముద్ర జలాల్లో తరచూ పడవ ప్రమాదాలు సంభవిస్తుండడంతో మత్స్యకారుల్లో తీవ్ర అలజడి రేగుతోంది. ఎప్పుడు ఎలాంటి ఘటనలు జరుగుతాయోనని నిత్యం వీరు భీతిల్లుతున్నారు.

కేజీహెచ్ పూర్వ ఏఆర్ఎంవోపై విచారణ



సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న భద్రత సిబ్బంది

మహారాణిపేట: కేజీహెచ్ పూర్వ ఏఆర్ఎంవో, ప్రస్తుత విమ్స్ ఆర్ఎంవో డాక్టర్ అరుణాదేవిపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి మంగళవారం విచారణ జరిగింది. భద్రతా విభాగ సూపర్‌వైజర్ల ద్వారా వసూళ్లకు పాల్పడ్డారని, నర్సింగ్ స్కూల్ విద్యార్థినుల పరీక్ష సమయంలో అతి జోక్యం చేసుకున్నారని.. ప్రభుత్వానికి, డీఎంఈ డాక్టర్ నరసింహారావుకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ లీలాను విచారణ అధికారిగా నియమించారు. ఈ మేరకు ఆమె మంగళవారం కేజీహెచ్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. భద్రత సిబ్బందితోపాటు సూపర్‌వైజర్లు, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ట్యూటర్లు, ఇతర సిబ్బందిని విచారించారు. డాక్టర్ అరుణాదేవిపై వచ్చిన ఫిర్యాదులపై వాస్తవాలను అడిగి తెలుసుకుని రికార్డ్ చేశారు. కాగా.. భద్రత విభాగం సూపర్‌వైజర్, ఇతర సిబ్బందిపై ఇదే విభాగానికి చెందిన మరో వర్గం ఫిర్యాదు చేసింది. కొంత మంది భద్రత సిబ్బంది కొద్ది సేపు సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తమను బలి చేయొద్దంటూ ఆందోళన తెలిపారు. విచారణ పూర్తి చేసిన తర్వాత నివేదికను డీఎంఈకు అందజేస్తానని డాక్టర్ పద్మలీల తెలిపారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం

విశేషంగా పూర్ణాహుతి



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున లోక కల్యాణార్థం నృసింహ హోమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయం నుంచి ఊరేగింపుగా కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ ఉన్న హోమ గుండం వద్ద అధిష్టింపజేశారు. స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శేషతల్పంపై కొలువుదీరారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా చేపట్టారు. ఉభయదాతలందరితో స్వామి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ కార్యక్రమం జరిపారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామి మూల విరాట్‌కి సమర్పించారు. అనంతరం ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు.



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు.. పాల్గొన్న అధికారులు, భక్తులు

50 ద్విచక్ర వాహనాల సీజ్

బీచ్‌రోడ్డు : మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 50 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సోమ, మంగళవారాల్లో వివిధ ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బైక్ రేసింగ్, సరైన పత్రాలు లేకపోవడం వంటి కారణాలతో 50 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే కేజీహెచ్‌లో అగ్ని ప్రమాదం

- సీఎస్సార్ బ్లాక్‌లో వ్యాపించిన దట్టమైన పొగ
- అంకాలజీ యూనిట్‌కు రోగుల తరలింపు
- ఎలాంటి నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న వైద్యులు



అగ్ని ప్రమాదానికి కారణమైన వెంటిలేటర్

మహారాణిపేట: కేజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం జరిగిందని విచారణ కమిటీ తేల్చింది. సోమవారం అర్ధరాత్రి కేజీహెచ్ సీఎస్సార్ బ్లాక్ మూడో అంతస్తు ఐఆర్‌సీయూ బ్లాక్‌లో వెంటిలేటర్ బ్యాటరీ పేలిన ఘటన తెలిసిందే. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వెంటిలేటర్ నుంచి పొగ వ్యాపించింది. ఆ సమయంలో వార్డులో 8 మంది రోగులు చికిత్స పొందుతుండగా.. వారికి ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో వైద్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వార్డులో 12 పడకలు ఉన్నాయి.



అగ్ని ప్రమాదం జరిగిన వార్డు

చార్జింగ్ సమయంలో పేలుడు..

వెంటిలేటర్‌కు చార్జింగ్ అవుతున్న సమయంలో పేలుడు సంభవించింది. కోవిడ్ సమయంలో కేంద్రం నుంచి 248 వెంటిలేటర్లు కేజీహెచ్‌కు చేరుకున్నాయి. ఇందులో ఒకటి పేలిపోగా.. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. దీంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. ఆ తర్వాత అగ్ని మాపక అధికారులు రంగంలో దిగే సరికి మంటలు అదుపులోకి వచ్చాయి.

ముగ్గురు వైద్యులతో విచారణ

అగ్ని ప్రమాదంపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ముగ్గురితో విచారణ కమిటీ వేశారు. అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ వి.రవి, ఏఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కరరావు, బయోమెడికల్ ఇంజినీర్ రాజేష్ విచారణ పూర్తి చేశారు. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించిందని సూపరింటెండెంట్‌కు నివేదిక సమర్పించారు.



వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలను పరిశీలిస్తున్న సాంకేతిక నిపుణులు

రోగుల తరలింపు

పేలుడు సమయంలో వార్డులోని రోగులు భయాందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగరావడంతో పాటు శబ్దం వినిపించింది. అదృష్టవశాత్తూ రోగులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో రాత్రికి 8 మంది రోగులను కింద అంతస్తులోని మెడికల్ అంకాలజీ వార్డుకు తరలించారు. ప్రస్తుతం వారికి అక్కడే వైద్య సేవలు అందుతున్నాయి.

ప్రజల సొమ్ముతో పంచకర్ల పుట్టినరోజు!

- జీవీఎంసీ పరిధిలో బలవంతంగా వసూళ్లు చేసిన జనసేన నాయకులు
- ఆ సొమ్ముతో భారీ ఎత్తున రమేష్‌బాబు జన్మదిన వేడుక
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన జనసైనికుల దోపిడీ

పెందుర్తి: 'ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలు చేస్తున్నాం. ప్రతి ఇంటికీ రూ.1000 చొప్పున ఇవ్వాలి. లేదంటే తర్వాత ఇబ్బందులకు గురవుతారు. మీ కాలనీకి రోడ్లు ఉండవు. ఇతర సౌకర్యాలు రావు'అంటూ జనసేన నాయకులు వసూళ్ల పర్వానికి తెర తీశారు. ఈ నెల 13న జరిగిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు జరిపేందుకు జనసేన నాయకులు ఊర్ల మీద పడ్డారు. జీవీఎంసీ పరిధి పలు వార్డుల్లోని అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌస్‌లతో పాటు వ్యాపారులు, ఇతర వర్గాలకు చెందిన ప్రజల నుంచి నలుగురైదుగురు జనసేన నాయకులు గుంపుగా వెళ్లి వసూళ్లు చేశారు. ఎమ్మెల్యే పుట్టిన రోజుకు మేమేందుకు డబ్బులు ఇవ్వాలని ప్రజలు అనేసరికి బెదిరింపులకు దిగారు. మీ ప్రాంతానికి సౌకర్యాలు లేకుండా చేస్తామని హెచ్చరికలు చేయడంతో చేసేది లేక ప్రజలు డబ్బులు ఇచ్చినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంచకర్ల పుట్టినరోజు వేడుకల పేరు చెప్పుకుని ఆయా నాయకులు దాదాపు రూ.15 లక్షల వరకు వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇందులో సగం కూడా ఖర్చు పెట్టకుండా వాళ్ల జేబుల్లోనే వేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయితే ఎమ్మెల్యేగా అధికారికంగా అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయకముందే పంచకర్ల అనుచరులు చెలరేగిపోతుండడం గమనార్హం. రానున్న రోజుల్లో జనసేన నాయకుల ఆగడాలు మరెన్ని చూడాలో అని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కాగా ఈ వసూళ్ల పర్వం ఎమ్మెల్యే పంచకర్లకు తెలిసి జరిగిందా.. తెలియకుండా జరిగిందా అన్నదే ప్రశ్నార్థకం.

రూ.460 కోట్లు పంట రుణాల లక్ష్యం

- డీసీసీబీ ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం
- 20 వేల మంది రైతులకు బ్యాంకు ద్వారా తోడ్పాటు
- వ్యవసాయ సాగులో యంత్రీకరణకు ప్రోత్సాహం
- రుణాల రీ-షెడ్యూల్‌పై ప్రత్యేక దృష్టి
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 30 బ్రాంచీలు, వాటి పరిధిలో 98 సొసైటీల ద్వారా కార్యకలాపాలు



మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య : ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు పడితే విత్తనాలు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ సమయంలో రైతులకు ముందస్తు పెట్టుబడి సాయం ఎంతో అవసరం. వ్యవసాయ పనులకు అవసరమయ్యే డబ్బుల కోసమని గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు వ్యాపారులు, పెట్టుబడిదారులపై ఆధారపడే పరిస్థితులు ఇంకా ఉన్నాయి. ఈ తరుణంలో రైతులకు పెద్దదిక్కుగా అవసరమైన ఆర్థిక సాయం అందించేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముందు వరుసలో నిలుస్తోంది. అర్హత గల ప్రతీ రైతుకు అవసరం మేరకు రుణాలు ఇచ్చేలా బ్యాంకు అధికారులు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. జూన్ నెల కావటంతో బకాయిల వసూళ్లు, రీ-షెడ్యూల్‌తో పాటు అవసరమైన వారికి రుణాలు అందించేలా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ తమ పరిధిలోని బ్రాంచిల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

రైతులకు ఖరీఫ్ రుణాలు

2024–25లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా రూ.460 కోట్లు పంట రుణాలు ఇచ్చేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఖరీఫ్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలో 20 వేల మందికి పైగా రైతులకు ఖరీఫ్ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మార్చి మాసాంతం వరకు రూ.319.12 కోట్లు షార్ట్ టెర్మ్ రుణాలు(వ్యవసాయ రంగం) ఇవ్వగా, ఈ ఏడాది అంతకు మించి రుణాలు ఇచ్చారు. సాగు రైతులకు తోడ్పాటు అందించే క్రమంలో భూములపైనే కాకుండా బంగారు ఆభరణాలపై కూడా మిగతా బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నారు. ఇలా గతేడాది రూ.781 కోట్లు మేరు రుణాలు ఇవ్వగా, 2024–25 సంవత్సరంలో దీన్ని రూ.1000 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

యంత్రీకరణకు పెద్దపీట

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటిస్తూ సాగు చేసే రైతులకు మరింత తోడ్పాటు అందించేలా బ్యాంకు అధికారులు నిర్ణయించారు. గ్రామాల్లోని కొంతమంది రైతులు కలసి ఏర్పాటు చేసుకున్న కస్టమ్ హైరింగ్ కేంద్రాలు(సీహెచ్‌సీ)లను ప్రోత్సహిస్తున్నారు. యంత్రీకరణ పరికరాలు అనగా ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, బ్లోయర్స్, రోటా వేటర్లు, దమ్ము పరికరాలు వంటివి కొనుగోలుకు రూ.15 లక్షలు వరకు యూనిట్‌గా 50 శాతం డీసీసీబీ ద్వారా తక్కువ వడ్డీకే రుణం అందిస్తున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఇలా 208 గ్రూపులకు రూ.4.56 కోట్లు మంజూరు చేశారు. బ్యాంకు ద్వారా సేవలు పొందుతున్న సభ్యుల్లో 75,757 మంది రైతులకు కిసాన్ రూపే కార్డులు జారీ చేశారు.

కొత్త బ్రాంచీలు ఏర్పాటుపై కసరత్తు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలోని 30 బ్రాంచీలు, వాటి పరిధిలోని 98 వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. బ్యాంకు అభివృద్ధిలో భాగంగా కొత్త బ్రాంచీల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించారు. విశాఖ జిల్లాలోని పద్మనాభంలో ఇటీవలనే బ్రాంచి ప్రారంభించారు. ఇంకా కొత్తగా అనకాపల్లి -9, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 2 కొత్త బ్రాంచీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బ్రాంచీల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంకు నుంచి అనుమతులు కోరుతూ సమగ్ర నివేదికలను పంపించారు.

రైతులకు అండగా నిలుస్తాం



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అండగా నిలిచేలా తగిన కార్యాచరణ సిద్ధం చేశాం. అర్హత గల రైతులందరికీ పంట రుణాలు అందిస్తాం. దీనిపై బ్రాంచిల వారీగా లక్ష్యాలను నిర్దేశించాం. రుణాల రికవరీ లక్ష్యం మేరకు సాగితేనే బ్యాంకు అభివృద్ధికి దోహదపడుతుంది. రైతుల తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, బ్యాంకు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. రైతులకు తోడ్పాటు అందిస్తూనే, బ్యాంకు అభివృద్ధిలో భాగంగా వ్యాపార విస్తరణపై కూడా దృష్టి పెట్టాం.

– డి.వి.ఎస్.వర్మ, సీఈవో, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

రేపు జాబ్ మేళా

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నేషనల్ కెరీర్ సెంటర్‌లోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కేంద్రం డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఐ స్మార్ట్ సొల్యూషన్స్‌లో టెలికాలర్‌గా మహిళలకు, డి మార్ట్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్‌గా పురుషులకు, పిజా హట్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్‌గా పురుషులకు, రాథోడ్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్ నియామకానికి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరికి నెలకు రూ.10 వేల నుంచి 15 వేల వరకు వేతనంగా అందిస్తారు. వివరాలకు 0891–2844184, 9666092491లో సంప్రదించవచ్చు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,220
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,200
వెండి(కిలో):	రూ.96,.000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.128
బ్రాయిలర్ (లైవ్)	: రూ.148
స్కిన్	: రూ.266
స్కిన్‌లెస్	: రూ.276

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	500.00
విజయనగరం	504.00
శ్రీకాకుళం	504.00

శ్రావణం వరకు ఆగాల్సిందే..

- గురు, శుక్ర మూఢాలతో వివాహాలకు బ్రేక్
- మళ్లీ ఆగస్టులోనే శుభ ముహూర్తాలు
- సెప్టెంబర్ 4 నుంచి అక్టోబర్ 3 వరకూ శూన్యమాసం



మహారాణిపేట: పెళ్లిబాజా మోగాలంటే శ్రావణం వరకూ ఆగాల్సిందే. ఏప్రిల్ 28 నుంచి వరసగా మూఢమి రావడంతో శుభకార్యాలకు ఆటంకం కలిగింది. అప్పటి నుంచి వివాహాలు, ఉపనయనాలు, గృహ ప్రవేశాల వంటివన్నీ నిలిచిపోయాయి. మళ్లీ ఆగస్టులో వచ్చే శ్రావణంలో మూడుముళ్లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి.

క్రోధి నామ సంవత్సరంలో ఏప్రిల్ 9 తేదీ నుంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. 26వ తేదీ(చైత్ర మాసం) వరకూ మంచి ముహూర్తాలు ఉండటంతో జిల్లా వ్యాప్తంగా వేలాది శుభకార్యాలు జరిగాయి. ఆ తర్వాత ఏప్రిల్ 28వ తేదీ (చైత్ర చవితి) నుంచి జూలై 8వ తేదీ (ఆషాఢ శుద్ధ తదియ) వరకూ శుక్ర మౌఢ్యమి (మూఢం) నడుస్తోంది. దీంతో ఆయా రోజుల్లో ముహూర్తాలు లేక శుభకార్యాలు ఆగిపోయాయి. అలాగే మే 7వ తేదీ (చైత్ర బహుళ చతుర్దశి) నుంచి జూన్ 7వ తేదీ వరకూ గురు మౌఢ్యమి నడిచింది. వరుసగా గురు, శుక్ర మౌఢ్యములు రావడంతో రెండు నెలలుగా శుభ కార్యాలకు ఆటంకం ఏర్పడింది.

ఆషాఢంలో కూడా ముహూర్తాల్లేవ్..

జూలై 6వ తేదీ నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు ఆషాఢమాసం ఉంటుంది. ఇది శూన్యమాసం. మొత్తం మీద ఏప్రిల్ 28 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పెళ్లి బాజాలు మోగే అవకాశం లేదని పురోహితులు చెబుతున్నారు. మూఢంలోని మంచిరోజుల్లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం, నామకరణం, నూతన వ్యాపారాల ప్రారంభోత్సవాలు, సీమంతాలు, రిజిస్ట్రేషన్ల వంటి పనులు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇక సెప్టెంబర్ 4వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ భాద్రపదం కూడా శూన్య మాసం కావడంతో ఆ నెలలోనూ వివాహాల ముహూర్తాలు ఉండవు. దీంతో శుభముహూర్తాలకు ఆగస్టు వేదిక కాబోతోంది. ఆగస్టులో వచ్చే శ్రావణ మాసంలో దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి.

ఉపాధికి గండి..

కొన్ని రోజులుగా వివాహ ముహూర్తాలకు మూఢాలు అడ్డంకి మారాయి. దీంతో వందలాది మంది ఉపాధిపై తీవ్ర ప్రభావం పడింది. కేవలం శుభకార్యాలపైనే ఆధారపడి ఎన్నో వృత్తులవారు జీవనం సాగిస్తున్నారు. కల్యాణ మండపాలు, కేటరింగ్, వంటవాళ్లు, పురోహితులు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, ట్రావెల్స్, అద్దె కార్లు, బస్సులు, మినరల్ వాటర్, ఈవెంట్ మేనేజ్‌మెంట్లు, పూలు, డెకరేషన్స్, లైటింగ్, కూరగాయలు, కిరాణ, వస్త్రదుకాణాలు, బంగారు, వెండి వ్యాపారాలు, టెంట్ హౌస్‌లు, మాంసపు దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులు తదితర వారికి పనిలేకుండా పోయింది. మరెంతో మంది రోజువారీ కూలీలకూ ఉపాధి కొరవడింది. అడపాదడపా చిన్న చిన్న ఫంక్షన్లు వస్తున్నా... పెళ్లిళ్లు అయితేనే తమకు గిట్టుబాటు అవుతుందని ఆయా వర్గాల వారు చెబుతున్నారు. శ్రావణం వరకు ఎదురు చూడాల్సిందేనని పేర్కొంటున్నారు.

శ్రావణంలో దివ్యమైన ముహూర్తాలు



వరసగా ముఢాలు రావడంతో శుభకార్య క్రమాలకు బ్రేక్ పడింది. ఆగస్టు 5వ తేదీ నుంచి మంచి రోజులు వస్తున్నాయి. 8వ తేదీ నుంచి ముహూర్తాలు ఉన్నాయి. మళ్లీ భాద్రపద మాసం శూన్య మాసం కావడంతో ఎలాంటి ముహూర్తాలు లేవు. మళ్లీ అక్టోబర్ 3వ తేదీ తర్వాత ముహూర్తాలు ఉన్నాయి.

– వెలవలపల్లి కోటేశ్వర శర్మ, వేదపండితులు, యజ్ఞశ్రీ జోతిష్యాలయం, మునగపాక

యోగా.. హుషారుగా!







మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని మహారాణిపేట క్షీరాబ్ధి యోగా సెంటర్‌లో మంగళవారం యోగా సాధకులు ఆసనాలు వేశారు. సెంటర్ అధ్యక్షురాలు డాక్టర్ శ్రీ లక్ష్మి, కార్యదర్శి చాతుర్య ఆధ్వర్యంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు యోగాసనాలు వేసి ఔరా అనిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ లక్ష్మి మాట్లాడుతూ నిత్యం యోగా సాధన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. తద్వారా మనిషి జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. విద్యార్థులకు జ్ఞాపక శక్తిని పెంపొందించడానికి యోగా మంచి సాధనమన్నారు. విద్యార్థులకు ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బిందు, మాధవి, క్షీరాబ్ధిదుతి, పండు, మౌనిక, కిరణ్, ఎస్.మహేష్, జయంతి కాత్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు కూలి ఇద్దరికి గాయాలు



భయాందోళనలో బాలాజీ, చిన్నమ్మలు, కుటుంబ సభ్యులు



కూలిన పెంకుటిల్లు పైకప్పు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో పాత పెంకుటిల్లు పైకప్పు కూలి ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఇంట్లో భీముని బాలాజీ, చిన్నమ్మలు, వారి పిల్లలు బి.శ్యామ్, బి.రమేష్, బి.దుర్గ నివాసం ఉంటున్నారు. కొన్ని రోజుల కిందట బాలాజీ అత్త మజ్జి లక్ష్మి చికిత్స నిమిత్తం వీరి ఇంటికి వచ్చింది. మంగళవారం ఒక్కసారిగా ఇంటి పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న బాలాజీ కాలుకు స్వల్ప గాయం కాగా.. లక్ష్మి తల, చేతిపై గాయాలయ్యాయి. పిల్లలు స్కూల్‌కు వెళ్లడంతో వారికి ప్రమాదం తప్పింది. స్థానికులు వారిని దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లి.. వైద్యం అందించారు.

ముగిసిన మోదమ్మ ఉత్సవాలు



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు

హుకుంపేట: మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవాలు హుకుంపేటలో మంగళవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలకు ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి భారీగా తరలివచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఊరేగింపులో శక్తివేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారిని అరకు ఎంపీ తనూజారాణి, చెట్టి వినయ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న అరకు ఎంపీ తనూజారాణి దంపతులు

అల్లూరి వెదురు అదిరే..

- నాణ్యత లేకపోవడంతో భారీగా పడిపోయిన అసోం వెదురు అమ్మకాలు
- ధర ఎక్కువైనా పటుత్వంలో అటవీశాఖ వెదురు టాప్
- కొనుగోలుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- అటవీశాఖకు భారీగా సమకూరనున్న ఆదాయం
- వందలాది కుటుంబాలకు ఉపాధి అవకాశాలు

ఒకప్పుడు అటవీశాఖ వెదురుకు గట్టి పోటీ ఇచ్చి ఆదాయాన్ని దెబ్బతీసిన అసోం వెదురును ఇప్పుడు కొనేవారు కరువయ్యారు. తక్కువ ధర ఉన్నందున వ్యాపారులు అక్కడి వెదురును కొనుగోలు చేసి ఈ ప్రాంత రైతులకు విక్రయించేవారు. అయితే పటిష్టంగా లేక ఆరు నెలలకే పాడవడంతో రైతులు దీనిపై ఆసక్తి చూపడం లేదు. అటవీశాఖ వెదురు నాణ్యతగా ఉండటమే కాకుండా రెండేళ్ల వరకు ఉపయోగపడటంతో రైతులు మళ్లీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో వెదురు సేకరణ పను లు ఊపందు కోనున్నందున వందలాది కుటుంబాలకు ఉపాధి లభించనుంది.

కొయ్యూరు: అటవీశాఖ వెదురుకు పూర్వ వైభవం రానుంది. ఇప్పటి వరకు పోటీ ఇచ్చిన అసోం వెదురు నాణ్యతగా లేనందున రైతులు మళ్లీ అటవీశాఖ వెదురును కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో వెదురు పుంతల సంరక్షణపై అటవీశాఖ దృష్టి సారించనుంది.

● రెండు దశాబ్దాల క్రితం వరకు ఇక్కడ వెదురును ఎక్కువగా రాజమండ్రి పేపర్ మిల్లుకు తరలించేవారు.అప్పట్లో ఈ ప్రాంత వెదురుతోనే పేపర్ తయారయ్యేది. ఇందుకోసం అప్పట్లో మారుమూల ప్రాంతాలకు సైతం రహదారులు ఏర్పాటు చేశారు. అయితే ఇతర కలపతో కూడా పేపర్ తయారు చేసే అవకాశం రావడంతో వెదురు కొనుగోలును పేపరు మిల్లు నిలిపివేసింది.

సంరక్షణపై మళ్లీ దృష్టి

పెదవలస, సీలేరు, .లోతుగెడ, కృష్ణదేవిపేట రేంజ్‌ల పరిధిలో వెదురు కూపీలు ఎక్కువగా ఉన్నాయి. కొనుగోళ్లు లేక ఆదాయం తగ్గిన కారణంగా కొద్ది సంవత్సరాలుగా వెదురు పొదల సంరక్షణను అటవీశాఖ వదిలేయడంతో సంతతి కొంత వరకు అంతరించిపోయింది. ఇప్పుడు డిమాండ్ పెరగడంతో అటవీశాఖ మళ్లీ వీటి సంరక్షణపై దృష్టి సారించనుంది.



అటవీ ప్రాంతంలో ఏపుగా పెరిగిన వెదురు పుంతలు

పొడవును బట్టి ధర

● వెదురు పొడవు ఆధారంగా ధర ఉంటుంది. 6 నుంచి 9 అడుగుల పొడవు ఉన్న వెదురు ధర రూ.70 వరకు పలుకుతుంది. అదే 9 నుంచి 12 అడుగుల వరకు ఉంటే రూ.120 ధర లభిస్తుంది. ఇలా వెదురు ఎంత పొడవుగా ఉంటే అంత ధర పలుకుతుంది.

● మైదాన ప్రాంతాల్లో వెదురును ఎక్కువగా వ్యవసాయానికి ఎక్కువగా వినియోగిస్తారు. అనేక చోట్ల కూరగాయలను పండించేందుకు ఉపయోగించే పందిర్లను వెదురుతో ఏర్పాటు చేస్తారు. ఇళ్ల నిర్మాణంతోపాటు గృహాలంకరణ వస్తువుల తయారీలోను ఉపయోగిస్తున్నారు.

● ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఎనిమిది నుంచి పది లక్షల వెదుర్లు అమ్మకాల ద్వారా అటవీశాఖకు రూ.ఐదు కోట్ల వరకు ఆదాయం వచ్చేది. అమ్మకాలు పడిపోవడంతో ప్రస్తుతం రూ.కోటికి మించి ఆదాయం రావడం లేదు.

● నాణ్యతలో అసోంలో వెదురు ఎక్కువగా నీటిలో తడవడం వల్ల నాణ్యతగా ఉండటం లేదు. ఈ ప్రాంతంలో వెదురు అటవీ ప్రాంతంలో లభ్యమవుతుంది.ఇక్కడ అడవులు 25 నుంచి 40 డిగ్రీల ఏటవాలుగా ఉన్నందున వర్షాలు కురిసినా నీరు నిల్వ ఉండదు.



వెదురు లోడింగ్

● ఏటా ఈ ప్రాంతంలో అక్టోబర్/నవంబర్ నెలల్లో వెదురు సేకరణ ప్రారంభించి మే వరకు కొనసాగిస్తారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే నరికివేత ఆపేస్తారు.

ధర రెట్టింపైనా..

మన ప్రాంత వెదురుతో పోలిస్తే అసోం వెదురు ధర తక్కువ. అందువల్ల స్థానిక వ్యాపారులు అక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చి ఈ ప్రాంతంలో రైతులకు విక్రయించేవారు. దీని ప్రభావం స్థానికంగా లభ్యమయ్యే వెదురు అమ్మకాలపై ప్రభావం చూపడంతో అటవీశాఖ భారీ స్థాయిలో ఆదాయం కోల్పోయింది. అసోం వెదురు ఆరు నెలలకే పాడైపోవడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. స్థానికంగా లభ్యమయ్యే వెదురు ఏడాదిన్నర వరకు పటుత్వంగా ఉంటోంది. దీంతో ఈ ప్రాంత రైతులు ఈ వెదురును కొనుగోలు చేస్తున్నారు. అసోం వెదురు ఒకొక్కటి రూ.35 నుంచి రూ.65 వరకు ఉండగా ఈ ప్రాంత వెదురు ధర అంతకు రెట్టింపు ఉంటుంది. రెండేళ్ల వరకు ఉపయోగపడుతున్నందున ధర ఎక్కువైనా కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు.

అమ్మకానికి సిద్ధం



అటవీశాఖ వెదురుకు మళ్లీ డిమాండ్ పెరుగుతోంది. నాణ్యత బాగున్నందున అమ్మకాలు పెరుగుతున్నాయి. నర్సీపట్నం కలప డిపోలో సుమారు 70వేల వెదుర్లు అమ్మకానికి సిద్ధంగా ఉంచాం. వర్షాలు ప్రారంభం కావడంతో అటవీ ప్రాంతంలో సేకరణ పనులు ఆగాయి. వర్షాలు తగ్గిన వెంటనే అక్టోబర్/నవంబర్ నుంచి సేకరణ చేపడతాం.

– సీహెచ్ సూర్యనారాయణ పడాల్, చింతపల్లి డీఎఫ్‌వో

మై గవర్నమెంట్ క్విజ్‌లో కుసర్లపూడి సోషల్ టీచర్ ప్రతిభ

రోలుగుంట: 'మై గవర్నమెంట్ క్విజ్'లో కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ అప్పన రాంబాబు ప్రతిభ చూపి 2 లక్షల క్లబ్‌లో చేరి, చేంజర్ మేకర్ హోదా దక్కించుకున్నారు. ఆ పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహన్‌రావు, సహచర ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ పోటీలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో పాల్గోవచ్చు. కుసర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచరుగా పనిచేస్తున్న అప్పన రాంబాబు గత ఏడాది నవంబర్ నెలలో తన ప్రస్థానం ప్రారంభించారు. స్వచ్ఛభారత్, ఆజాద్ అమృత మహోత్సవం, బేటీ బచావో బేటీ పడావో, వీరగాథ, ఫ్రీడమ్ ఫైటర్, చారిత్రక ప్రదేశాలు, బ్యాంకింగు, పరీక్ష పే చర్చ, దూరదర్శన్ తదితర పోటీల్లో పాల్గొని తన ప్రతిభ చూపించి సుమారు 100 మెరిట్ ధ్రువీకరణ పత్రాలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్విజ్ వల్ల సామాజిక విషయాలు తెలియడంతో పాటు విషయ పరిజ్ఞానం పెరిగిందని చెప్పారు.



'మేరా మట్టి మేరా దేశ్' క్విజ్ పోటీలో పొందిన ధ్రువీకరణ పత్రం, (ఇన్‌సెట్) రాంబాబు మాస్టారు

కొర్రాజులకు కోటి దండాలు

మూడేళ్లకు ఒకసారి జరిగే కొర్రాజుల జాతర ఘనంగా మంగళవారం ముగిసింది. భారీగా భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. గిరిజన పూజార్లతో పాటు భక్తులు అగ్నిగుండం తొక్కేందుకు పోటీపడ్డారు. పది రోజులుగా జరుగుతున్న ఈ జాతర సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టింది.

- భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం తొక్కిన భక్తులు
- భారీగా తరలిరావడంతో సందడి



అగ్నిగుండం దాటుతున్న భక్తులు

వీఆర్‌పురం : పోతురాజు గద్దె వద్ద నిర్వహించిన కొర్రాజుల జాతరకు భక్తులు పోటెత్తారు. రేఖపల్లి చెరువుకు సమీపంలోని గద్దెవద్ద గత పది రోజుల నుంచి కొండరెడ్డి, నాయకపోడు గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న జాతర మంగళవారం అగ్నిగుండం (కొండాలు) తొక్కడంతో ముగిసింది. వివిధ ప్రాంతాల నుంచి కుల మతాలకు అతీతంగా భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చారు. గద్దెపై ఉంచిన పోతురాజు, పెదసార్లమ్మ, చినసార్లమ్మ (కొర్రాజులు) ఉత్సవ విగ్రహాలను పూజార్లు పాండురాజు, పోతిరెడ్డి, లచ్చిరెడ్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఇక్కడికి సమీపంలోని సంత చెరువుకు తీసుకువెళ్లారు. అక్కడ స్నానం ఆచరించిన అనంతరం ఊరేగింపుగా తిరిగి రేఖపల్లి గద్దె వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సిద్ధం చేసిన నిప్పుల గుండం చుట్టూ మూడుసార్లు దేవతల ప్రతిమలను ప్రదక్షిణలు చేయించారు. పూజార్లు ప్రతిమలతో నిప్పులగుండం తొక్కుకుంటూ గద్దె లోపలికి చేరుకున్నారు. అనంతరం దేవార్లతో పాటు భక్తులు నిప్పుల గుండం తొక్కేందుకు పోటీపడ్డారు.



ఆరాధించే కొర్రాజులు ఉత్సవ విగ్రహాలు



అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో భక్తులు

అగ్నిగుండం వద్ద బూడిదను ఇళ్లకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ అగ్నిగుండాన్ని ఒక్కసారి తొక్కితే కుటుంబం అంతటికీ మేలు జరుగుతుందని నమ్మకమన్నారు. అందువల్లనే అగ్నిగుండం తొక్కేందుకు పోటీపడతామని వారు పేర్కొన్నారు. జాతరలో ఎలాంటి అపశ్రుతులు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ రాధాకృష్ణ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.